ప్రతి అక్షరం ప్రజాహితం

RNI TITLE CODE: 16425

www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి -01 సంచిక - 211 ఆదివారం 24 మార్చి 2024, ఎడిటర్: సీఎం. శ్రీనివాస్ , పేజీలు - 4 , వెల -03/-

## ఎన్నికలకు టిడిపి సిద్ధం.. అభ్యర్థులకు దిశా నిర్దేశం చేసిన చంద్రబాబు.!






**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:** ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వచ్చేసింది.. ఈ సారి జనసేన–బీజేపీతో కలిసి బరిలోకి దిగుతోన్న తెలుగుదేశం పార్టీ.. ఇప్పటికే మూడు జాబితాలుగా అభ్యర్థులను ప్రకటించింది.మరికొన్ని స్థానాలకు సంబంధించిన అభ్యర్థులపై క్లారిటీ రావాల్సి ఉంది.. అయితే, మరోవైపు ఎన్నికలకు సిద్ధమవుతోంది టీడీపీ. అందులో భాగంగా ఈ రోజు తమ పార్టీ అభ్యర్థులతో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు ఆ పార్టీ అధినేత చంద్రబాబు. ఎన్నికల్లో వ్యూహాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వర్క్‌షాప్‌లో చర్చించనున్నారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్నదానిపై అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయనున్నారు చంద్రబాబు. ఇప్పటి వరకు 139 అసెంబ్లీ, 13 మంది లోక్‌సభ అభ్యర్థులను ప్రకటించింది టీడీపీ. మిగతా స్థానాలపై ఆ పార్టీ అధినేత కసరత్తు చేస్తున్నారు. మరోవైపు.. తమ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేకంగా దృష్టిసారించాయి.. వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి.. అందులో భాగంగా.. ఈ రోజు ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు.. ఎంపీ అభ్యర్థులతో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు. ఇక, అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది.. ప్రచారంలో దూకుడు పెంచిన విషయం విదితమే.. వైనాట్ 175 అంటూ ప్రచారం చేస్తున్నారు ఆ పార్టీ నేతలు.తెలుగుదేశం పార్టీకి కేటాయించిన 144 అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే 139 మంది అభ్యర్థులను ఆ పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఇక పార్లమెంట్ సీట్లలో కూడా మొత్తం 17 స్థానాలకు గాను 13 మంది అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయింది..ఇక జనసేనలో మొత్తం 21 అసెంబ్లీ స్థానాలకు గాను 16 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. రెండు పార్లమెంట్ స్థానాలపైనా స్పష్టత వచ్చింది. బీజేపీ మాత్రం ఇంకా అభ్యర్థుల ప్రకటన చేయలేదు.అయితే మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో ఎలా వెళ్లాలనే దానిపై దృష్టి పెట్టాయి. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల నియమావళి అమలు, నామినేషన్ల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు వర్క్ షాప్ నిర్వహించారు.ఈ వర్క్ షాప్ లో ఇప్పటి వరకూ ప్రకటించిన స్థానాల అభ్యర్థులతో పాటు మిగిలిన స్థానాల ఇంచార్జిలు,ఆయా నియోజకవర్గాల పరిశీలకులు హాజరయ్యారు.. టీడీపీ నుంచి ఆ పార్టీ అధినేత చంద్రబాబు వర్క్ షాప్ లో పాల్గొని అభ్యర్థులకు దిశానిర్దేశం చేసారు.

వివరాలు 2లో

## గుజరాత్‌లో బిజెపికి షాక్.. పోటీ నుంచి తప్పుకున్న ఎంపీ అభ్యర్థి..!




**ఆంధ్ర ప్రగతి/న్యూఢిల్లీ మార్చి 23:** గుజరాత్‌లో బీజేపీకి బిగ్ షాక్ తగిలింది. పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు పోటీకి ఆసక్తి చూపలేదు. గుజరాత్‌లోని వడోదర సెగ్మెంట్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజన్ భట్‌ను బరిలోకి దింపగా..తాజాగా ఆమె పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని రంజన్ భట్ ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. ఆమె అభ్యర్థిత్వాన్ని బీజేపీలోని పలువురు తీవ్రంగా వ్యతిరేకించడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.వడోదర లోక్‌సభ స్థానం నుంచి ఆమెను మళ్లీ నామినేట్ చేయాలనే బీజేపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. నగరంలోని పలు ప్రదేశాలలో బ్యానర్లు కూడా ప్రదర్శించారట. 2014లో జరిగిన ఉప ఎన్నికలో ప్రధాని మోడీ ఆ స్థానం నుంచి తప్పుకోవడంతో భట్ పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఇదే స్థానం నుంచి 2019లోనూ బరిలోకి దిగి విజయం సాధించారు.అలాగే సబర్‌కాంత లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి భిఖాజీ ఠాకూర్ కూడా ఎన్నికల్లో పోటీ చేయడం లేదని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. వ్యక్తిగత కారణాలతో ఎన్నికల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఠాకూర్‌పై కూడా స్థానిక నేతల అసంతృప్తినే కారణం. అయితే, ఈ పరిణామాలను చక్కదిద్దేందుకు బీజేపీ అధిష్టానం రాష్ట్ర నాయకత్వానికి మార్గనిర్దేశకం చేసినట్లు సమాచారం. గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు మే 7వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి.

## పిఠాపురంలో మారుతున్న లెక్కలు.. పవన్ సీటు బిజెపికే..!





**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:** రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉన్నా.. అందరి చూపూ.. అందరి చర్చా.. అంతా పిఠాపురం వైపే ఉంది. ఏ ఇద్దరు కలుసుకుని మాట్లాడినా.. పిఠాపురం ఎలా ఉంది బ్రో! అనే టాకే వినిపిస్తోంది. ఇది వాస్తవం. ఎందుకంటే.. ఇక్కడ నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోటీచేస్తుండడమే. అయితే.. దీనిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది. ఆయనే స్వయంగా ప్రకటించినా.. బీజేపీ కనుక ఈసీటు కోరితే.. సోము వీర్రాజుకు ఇవ్వాలని పట్టుబడితే మాత్రం ఆయన త్యాగం చేయకతప్పదని అంటున్నారు.తాజాగా బీజేపీలో జరుగుతున్న టికెట్ల చర్చల్లో పాల్గొన్న సోము వీర్రాజు పిఠాపురం మనం తీసుకుందాం అనేశారు. అంతే.. దీనిపై వెంటనే స్థానిక నేతల నుంచి పార్టీ ఆన్‌లైన్ నివేదికలు తెప్పించేసుకుంది. గతంలో ఒకసారి బీజేపీ ఇక్కడ గెలిచిన విషయం తెలిసిందే. దీనిని పట్టుకుని కాపు సామాజిక వర్గం ఎక్కు వగా ఉన్న ఈ నియోజకవర్గం మనం తీసుకుందామన్న ప్రతిపాదనకు అధిష్టానం దాదాపు జై కొట్టినట్టు తెలుస్తోంది.అందుకే బహుశ పవన్ ఇక్కడ నుంచిపోటీ చేయాలని భావించిన ఉదయ్‌ను కాకినాడకు పంపించారు. ఇదేసమయంలో తన పోటీపైనా.. సందేహం వ్యక్తం చేశారు. కాగా. తాజా అంచనాల ప్రచారం.. బీజేపీ తీసుకునే సీట్లలో రెండు నుంచి నాలుగు చోట్ల మార్పులు ఖాయమని అంటున్నారు. వీటిలో విశాఖప ట్నం ఎంపీ సీటు కూడా ఉండబోతోందని సమాచారం. దీని మాట ఎలా.. ఉన్నప్పటికీ.. పిఠాపురం మాత్రం బీజేపీ వదులుకునే పరిస్థితి లేదని చెబుతున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సీట్ల వ్యవహారంలో బీజేపీ రెండు స్ట్రాటజీలు లెక్కలోకి తీసుకుంది.1) తాము సొంతగా గతంలో గెలిచిన సీట్లు తీసుకోవడం. 2) టీడీపీ–జనసేన బలంగా ఉండి.. గెలుస్తారని అంచనా వేసుకున్న సీట్లను తీసుకోవడం. ఈ రెండు ప్రాతిపదికలే కేంద్రంగా బీజేపీ పావులు కదుపుతోం ది. ఈ నేపథ్యంలో సోము నోటి నుంచిపిఠాపురం అనే మాట వచ్చిందని.. ఆ వెంటనే ఈ నియోజకవర్గంపై పార్టీ అధిష్టానం నివేదికలు తెప్పించుకుందని తెలుస్తోంది. ఇక, విశాఖ సీటు వెనుక.. కూడా టీడీపీ బలంగా ఉండడమే కారణమని అంటున్నారు. మొత్తంగా పిఠాపురం అయితే.. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు.. బీజేపీకే దక్కే అవకాశం కనిపిస్తోంది.

## ప్రాణాలు పోతున్న ప్రయాణికులను కాపాడిన ఆర్టీసీ డ్రైవర్..!



**ఆంధ్ర ప్రగతి/విజయవాడ మార్చి 23:** గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతిచెందాడు. కానీ.. ఆయన చూపిన ముందుజాగ్రత్త, సమయస్ఫూర్తి వల్ల... బస్సులోని ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.తన ప్రాణం మీదకు వచ్చినా కూడా ఆర్టీసీ డ్రైవర్ బస్సులోని ప్రయాణికుల గురించి ఆలోచించాడు. గుండెపోటుతో బాధపడుతూ కూడా బస్సును జాగ్రతగా పక్కకు ఆపాడు. ఆ వెంటనే కుప్పకూలిపోయాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది గుర్తించి అతనికి సీపీఆర్ చేశారు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. అత్యవసరంగా ప్రథమ చికిత్స చేశారు. కానీ.... ఆ డ్రైవర్ ప్రాణం నిలబడలేదు. ఆస్పత్రికి వెళ్లిన కొన్ని క్షణాలకే ఆయన మృతిచెందాడు.ఆంధ్రప్రదేశ్లోని ఎన్టీఆర్ జిల్లాలో జరిగింది ఈ విషాదకర సంఘటన. పెళ్లి బృందంతో వెళ్తోంది ఆర్టీసీ బస్సు. వత్సవాయి మండలం గట్టు భీమవరం టోల్ప్లాజా దగ్గర రాగానే... ఆ బస్సులోని డ్రైవర్ అనారోగ్యానికి గురయ్యాడు. ఛాతీలో నొప్పి రావడంతో భరించలేకపోయాడు. అంత నొప్పిలోనూ... బస్సులోని ప్రయాణికుల గురించి ఆలోచించాడు ఆ డ్రైవర్. గుండెల్లో నొప్పి బాధిస్తున్నా... నెమ్మదిగా బస్సును రహదారి పక్కగా ఆపాడు. ఏం జరిగిందని ప్రయాణికులు గమనించేలోపే... స్టీరింగ్ ముందు కుప్పకూలిపోయాడు. బస్సులోని ప్రయాణికులు... అటువైపు వెళ్తున్న హైవే అంబులెన్స్కు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అతనికి సీపీఆర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉందని గమనించి... వెంటనే సమీపంలోని జగ్గయ్యపేట ఆస్పత్రికి తరలించారు. ఆ ఆస్పత్రిలోని వైద్యులు... ఆర్టీసీ డ్రైవర్కు ప్రాథమిక చికిత్స చేశారు. కానీ... ఆయన ప్రాణాలు మాత్రం కాపాడలేకపోయారు. ఆస్పత్రిలో చేరిన కొన్ని నిమిషాలకే ఆర్టీసీ డ్రైవర్ ప్రాణాలు వదిలాడు.ఆర్టీసీ బస్సు వివరాలునల్లగొండ జిల్లా మిర్యాగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఒక పెళ్లి బృందం బుక్ చేసుకుంది. ఆ బస్సు నెంబర్ %ఙా05గ్గ%0217. విజయవాడలో వివాహం ఉండటంతో... పెళ్లి బృందం మిర్యాలగూడ డిపో బస్సును బుక్ చేసుకుని. విజయవాడ వెళ్లి... పెళ్లి ముగిసిన తర్వాత అదే బస్సులో తిరిగి వచ్చేలా ప్లాన్ చేసుకున్నారు. మిర్యాలగూడ నుంచి విజయవాడకు వెళ్లారు. అక్కడ పెళ్లి వేడుక ముగిసిన తర్వాత... పెళ్లివారి బంధువులు అందరూ కలిసి మళ్లీ అదే బస్సులో.. మిర్యాలగూడ తిరుగుప్రయాణం అయ్యారు. మార్గం మధ్యలో ఆ బస్సు డ్రైవర్కు గుండెపోటు వచ్చింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించి... బస్సును పక్కకు ఆపకపోయిఉంటే... ఏం జరిగేదో చెప్పలేం. కానీ ఆర్టీసీ డ్రైవర్.. తన ప్రాణాల మీదకు వచ్చినా... బస్సులోని ప్రయాణికుల గురించి ఆలోచించారు. బస్సును పక్కకు ఆపడంతో.. పెను ప్రమాదం తప్పింది. బస్సులోని ప్రయాణికులంతా క్షేమంగా ఇళ్లకు చేరారు. కానీ... బస్సు డ్రైవర్ మాత్రం గుండెపోటుతో ప్రాణాలు విడిచాడు.

## మేమంతా సిద్ధమంటూ ఏపీలో వైసీపీ బహిరంగ సభలు : ఏపీ మంత్రి పెద్దిరెడ్డి




**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి పక్కావ్యూహంతో ప్రచారానికి సిద్ధమవుతుంది. ఇప్పటికే ఏపీలోని నాలుగు ప్రాంతీయ సిద్ధం సభలను విజయవంతంగా నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని పూరించిన వైసీపీ రాష్ట్రంలోని 21 చోట్ల భారీ బహిరంగ సభల నిర్వహణకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ సభలకు 'మేమంతా సిద్ధం' అనే టైటిల్‌ను ఖరారు చేసింది.ఈనెల 27న ప్రొద్దుటూరు, 28న నంద్యాల, 29న ఎమ్మిగనూర్‌లో సమావేశాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వచ్చే నెల మూడు, నాలుగు తేదీల్లో సభ నిర్వహించనున్నామని వెల్లడించారు. చిత్తూరు లేదా పూతలపట్టులో ఒక సభ, నాయుడుపేట లేదా శ్రీకాళహస్తిలో సభలు నిర్వహిస్తామని అన్నారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొనే సభలకు భారీ సంఖ్యలో కార్యకర్తలను, జనాలను తరలించాలని పార్టీ శ్రేణులకు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిర్వహించిన నాలుగు ప్రాంతాల్లో కాకుండా మిగిలిన జిల్లాలో సభలు జరుగుతాయన్నారు.

# సోషల్ మీడియా, కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

**- జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల, మార్చి 23:** సాధారణ ఎన్నికలు – 2024 కోసం ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ కమిటీ నుండి సోషల్ మీడియా, కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. డిఆర్ఓ ఎ. పద్మజ, ఎంసిఎంసి సభ్యులు ప్రభాకర్ చౌదరి, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా సోషల్ మీడియా, కేబుల్ ఛానెళ్ల ద్వారా ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి కచ్చితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని



తెలిపారు. ఈ కమిటీ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షించి సంబంధిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. పోటీ చేయు అభ్యర్థులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు అనుమతి పొందుట కోసం 3 రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ పరిశీలించి అనుమతి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు పోలింగ్ ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుండి అనుమతి పొంది ప్రకటన ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా పరిధిలోకి అన్ని రకాల టెలివిజన్ ఛానళ్లు, కేబుల్ నెట్వర్క్ లు, డిజిటల్ డిస్ప్లే లు, మొబైల్ నెట్వర్క్ ల ద్వారా ఎస్ఎంఎస్, వాయిస్ మెసేజ్ లు వస్తాయని, అలాగే సామాజిక మాధ్యమాలైన (సోషల్ మీడియా) ఫేస్బుక్, ట్విట్టర్, యూట్యూబ్ ఇంస్టాగ్రామ్, వాట్సాప్, గూగుల్ వెబ్సైట్లు, వికీపీడియా తదితర ప్రసరణ కూడా పరిశీలించి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సినిమా హాళ్లలోనూ ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలు కూడా తప్పనిసరిగా ముందస్తు ధ్రువీకరణ పొందాల్సి ఉంటుందన్నారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా చేసే ప్రసారాలు, ప్రకటనలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలుగా పరిగణించి, భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు సంబంధిత అభ్యర్థులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు.

---

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల లక్ష్యం

**- ఎన్నికల నిభందనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**
**- జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** నంద్యాల జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిద రాజకీయ పార్టీల నాయకులు,పెద్దలు ,ప్రజలు అందరూ ఎన్నికలు ప్రశాంతంగా జరుగడానికి సహకరించాలని మరియు ఎట్టి పరిస్థితులలోనూ ఎన్నికల నియమ నిభందనలు ఉల్లంగించరాదని తెలియజేయడమైనది.ఎవరైనా ఎన్నికల నిభందనలు ఉల్లంఘించిన ఎడల అట్టి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతునదని తెలియజేయడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లాలో ఆత్మకూరు టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలో యం యం ఫంక్షన్ హాల్ నందు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బుడ్డ రాజ శేఖర్ రెడ్డి వాలంటీర్లను బెదిరించినాడని మరియు గ్రామంలో వాలంటీర్లు తిరుగుతుంటే వారిపై దాడి చేసేలా తన పార్టీ సభ్యులను ప్రేరేపించాడని ఫిర్యాదు ఆదారంగా విచారణ జరిపి కేసు నమోదు చెయ్యడం జరిగింది. నంద్యాల పట్టణంలో శ్రీనివాస సెంటర్,బొమ్మలసత్రం వద్ద 04 ఆటోలు ఎన్నికల నిభందనలకు వ్యతిరేకంగా ఎవరి అనుమతి తీసుకోకుండా వారి ఆటో పై వివిద పార్టీలకు చెందిన స్టిక్కర్లు అతికించుకొని నంద్యాల టౌన్ నందు తిరుగుచుండడం వలన ఫ్లైయింగ్ స్కోర్డ్ అదికారులు గమనించి ఎన్నికల నియమావలి ఉల్లంఘించినందున సదరు ఆటో డ్రైవరులు 1) .మౌలాలి,షేక్. 2)మహమ్మద్ రఫీ. 3)బోయ . రాఘవేంద్ర,షేక్ .4)ఖాదర్ వలి అను వారిపై చట్ట ప్రకారం కేసు నమోదు చెయ్యడం జరిగింది.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరు ఎన్నికల నియమ నిబంధనకు లోబడి ఉండాలని నిబంధనలు అతిక్రమించిన వారిపై తప్పనిసరిగా చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

---

# ప్రశాంత వాతవారణంలో ఎన్నికలు జరిగే విధంగా చూడాలి

**- కర్నూలు రేంజ్ డిఐజి శ్రీ సిహెచ్. విజయ రావు**
**- నాలుగు జిల్లాల ఎస్పీ లతో పాటు డిఎస్పీలు, సిఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కర్నూలు రేంజ్ డిఐజి**
**- సి - విజిల్ యాప్ లో ఏవరైనా ఫిర్యాదులు చేస్తే పోలీసులు వెంటనే స్పందించాలి - పకడ్బందీగా విధులు నిర్వహించాలి - క్రికెట్ బెట్టింగ్ పై క్రైమ్ పోలీసులు నిఘా ఉంచాలి - ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ లకు పాల్పడితే గట్టి చర్యలు తీసుకోవాలి - డిఎస్పీలు, సిఐలు , ఎస్సైలు నేర నివారణ కు గట్టి చర్యలు తీసుకోవాలి - లైసెన్సు గన్‌లను అన్నింటిని డిపాజిట్ చేయించాలి**

**ఆంధ్ర ప్రగతి/కర్నూలు మార్చి 23:** ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి శ్రీ సిహెచ్. విజయ రావు కర్నూలు రేంజ్ పోలీసు అధికారులకు , సిబ్బందికి తెలియజేశారు. ఈ సంధర్బంగా శనివారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయం నుండి కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల ఎస్పీలతో కర్నూలు రేంజ్ డిఐజి శ్రీ సిహెచ్. విజయ రావు ఐపియస్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.ఈ సంధర్బంగా డిఐజి మాట్లాడారు.కర్నూలు రేంజ్ పోలీసులు బాధ్యతగా పని చేయాలి. ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు




వాస్తవాలను మీడియా కు వెళ్ళడించాలి. బందోబస్తు విధులకు కార్యచరణ ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలి.ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల పై నిఘా ఉంచాలి. ముందస్తుగా పోలీసు అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి. సమస్యాత్మక గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతులు నిర్వహించాలి.ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాలలో అవసరమైతే పికెట్ లు ఉంచాలి. ముందస్తు జాగ్రత్తల చర్యలు చేపట్టాలి. డిఎస్పీలు, సిఐలు , ఎస్సైలు నేర నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలి.గ్రేవ్ క్రైమ్ ల పై దృష్టి సారించాలి. నేర ప్రవృత్తి గల వారిని బైండోవర్ చేయాలి. పోలీంగ్ డే రోజు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి.స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర సిసి కెమెరాలతో పకడ్బందీ నిఘా ఉంచాలి. పోల్ డే రోజు సెంట్రల్ పోలీసు బలగాలతో, రూట్ మొబైల్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులతో పెట్రోలింగ్, రాత్రి గస్తీ విధులు పకడ్బందీగా ఉండాలి.ఎన్నికల ఉల్లంఘనల పై వెంటనే స్పందించి ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేయాలి. పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసు బలగాలతో బాగా రూట్ మార్చ్, ఫ్లాగ్ మార్చ్ చేయించాలి. గన్ లైసెన్సులను అన్నింటిని డిపాజిట్ చేయించాలి. ఇంటిగ్రేటేడ్ మరియు బార్డర్ చెక్ పోస్టులలో పోలీసులు, సెబ్, ఫారెస్ట్, ఆర్టీఏ అధికారులు సమన్వయంతో పని చేసే విధంగా చూడాలి. సంబంధిత అధికారులతో మాట్లాడాలి. ఎప్పటికప్పుడు చెక్ పోస్టులలో పోలీసు అధికారులు తనిఖీలు చేయాలి. పటిష్ట నిఘా ఉంచాలి. చెక్ పోస్టులలో ఏదైనా పట్టుబడితే సంబంధిత ఇన్ కం ట్యాక్స్ అధికారులకు లేదా ఇతర అధికారులకు సమాచారం అందించాలి. సి – విజిల్ యాప్ లో ఎవరైనా ఫిర్యాదులు చేస్తే పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. లా అండ్ ఆర్డర్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమనిబంధనలకు లోబడి పని చేయాలి.స్పెషల్ బ్రాంచ్ పోలీసులు లా అండ్ ఆర్డర్ పై నిఘా ఉంచి ఎప్పడికప్పుడు సమాచారాన్ని పై అధికారులకు చేరవేయాలి. ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతా వాతావరణంలో ఎన్నికలు జరిగేవిధంగా చూడాలి. ఈ విడియో కాన్ఫరెన్సులో నాలుగు జిల్లాల నుండి కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ జి.కృష్ణకాంత్ ఐపియస్, నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి , కడప జిల్లా శ్రీ సిద్ధార్థ్ కౌశల్, అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ బి. కృష్ణరావు, అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, పాల్గొన్నారు.

---

# విశాఖను డ్రగ్స్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా మార్చింది వైసీపీ

**- వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాకు అడ్డు లేకుండా పోయింది**
**- విదేశాల నుంచి పెట్టుబుడులు తీసుకుని రమ్మంటే జగన్ అండ్ కో డ్రగ్స్ తీసుకుని వస్తున్నారు- తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** డ్రగ్ మాఫియా వల్ల యువత భవిత చిద్రమవుతోందని, ఈ డ్రగ్ మాఫియాకు మూలకారణం వైసీపీ ప్రభుత్వమేనని, నంద్యాల పార్లమెంట్ కూటమి అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. ఈ మేరకు మీడియాకు ఓ ప్రకటక విడుదల చేశారు. ఒకప్పుడు పరిశ్రమలకు చిరునామాగా ఉన్నఆంధ్ర ప్రదేశ్ ను డ్రగ్స్ కు కేంద్రం గా వైసీపీ ప్రభుత్వం మార్చినట్లు తెలిపారు. జగన్ పాలనలో డ్రగ్స్ దిగుమతికి నంబర్ 1 స్థానం లో నిలబడిందన్నారు.విశాఖలో వేల కోట్లు విలువ చేసే కంటైనర్ లలో మత్తు పదార్థాలు లభ్యం అయ్యాయని తెలిపారు. 25 వేల కిలోల డ్రగ్స్ 50 వేల కోట్ల విలువ ఉంటుందని పేర్కొన్నారు. అంత విలువ చేసే కంటైనర్ ను ఆంధ్ర కి తీసుకురావడం సామాన్య విషయం కాదన్నారు. యువత భవితకు ఈ డ్రగ్స్, మత్తు పదార్థాలు అత్యంత ప్రమాదకరం అన్నారు. కల్తీ మద్యం , పనికి రాని బ్రాండ్ ల వల్ల, అక్రమ మద్యం వల్ల, ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని ఏ దిశకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు.విజయసాయి రెడ్డి, జగన్ కలిసి ఇలాంటి అరాచక పనులు చేయడం సబబా? అన్నారు. ముఖ్యమంత్రికి, విజయ సాయి రెడ్డి కి, కూనం పూర్ణ చంద్ర రావు లకి , బ్రెజిల్ కి వీటన్నింటికీ, వీరికి, ఉన్న సంబంధ బాంధవ్యాలు ఏమిటి? అని శబరి ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ కి, ముఖ్య మంత్రికి సంబంధాలు లేవా? అన్నారు. 16న ఈ తంతు జరిగితే 20 వరకు గోప్యం గా ఎందుకు ఉంచవలసి వచ్చింద న్నారు. ఈ వ్యవహారం అంతా చేసి చంద్ర బాబు పై, లోకేష్ పై, చంద్రబాబుకి సపోర్ట్ చేసే పార్టీ నేతలపై బురద చల్లడం సిగ్గుచేటన్నారు. ఈ కుట్ర లో భాగస్వాములు బయటకు వస్తారన్నారు. డ్రగ్ రాకెట్ లో ఈ ప్రభుత్వ ప్రమేయం బయట పెడతాం అన్నారు.రాబోయే ఎన్నికల్లో రాష్ట్రం లో అల్లర్లు సృష్టించడానికే ఇంత భారీ స్థాయిలో కుట్ర జరిపారన్నారు. ముఖ్యమంత్రి ప్రమేయం లేకుండా ఇవి జరుగుతాయా? అన్నారు. భారత దేశ చరిత్ర లో మొట్ట మొదటి సారిగా ఇంత పెద్ద ఎత్తున డ్రగ్స్ సరఫరా జరిగిందన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి వాటితో యువత ను నిర్వీర్యం చేయడంలో వైసీపీ నాయకుల హస్తం లేదా అని శబరి ప్రశ్నించారు. విశాఖను రాజధానిని చేస్తాను అని నమ్మబలికిన జగన్ రెడ్డి... డ్రగ్స్‌కి కేంద్రంగా మార్చారన్నారు. ఇప్పటికైనా ప్రజలు వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంకి మద్దతు తెలిపి, ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.



## ఎన్నికలకు టిడిపి సిద్ధం.. అభ్యర్థులకు దిశా నిర్దేశం చేసిన చంద్రబాబు.!

(మొదటి పేజీ తరువాయి)

జనసేన నుంచి నాదెండ్ల మనోహర్ తో పాటు కందుల దుర్గేష్ హాజరయ్యారు..బీజేపీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ శ్రీపాద సత్యనారాయణ,పాతూరి నాగభూషణం హాజరయ్యారు..క్షేత్ర స్థాయిలో మూడు పార్టీలు కలిసి సమన్వయం చేసుకోవడంతో పాటు ఎక్కడా విబేధాలు లేకుండా చూసుకోవాలని అభ్యర్థులకు చంద్రబాబు దిశానిర్దేశం చేసారు.వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కు కేంద్రంలో 400 సీట్లు,ఏపీలో 160 అసెంబ్లీ స్థానాలు,25 లోక్ సభ స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చంద్రబాబు తెలిపారు.తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు వర్క్ షాప్‌లో పొత్తుల అంశంపై పార్టీ నేతలకు స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు చంద్రబాబు. పొత్తులు ఎందుకు పెట్టుకోవాల్సి వచ్చిందనే దానిపై అభ్యర్థులకు వివరించారు. గతంలోనూ అనేకసార్లు పొత్తులు పెట్టుకున్నామన్న చంద్రబాబు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈసారి జనసేన, బీజేపీతో పొత్తులో భాగంగా పార్టీ కోసం కష్టపడిన వారికి సీట్లు ఇవ్వలేకపోయామని చెప్పారు.టీడీపీ వదులుకున్న 31 స్థానాల్లో అభ్యర్థులు పార్టీ కోసం కష్టపడిన వారేనని, అలాగే జనసేనలో గత ఎన్నికల్లో పోటీ చేసిన వారికి కూడా ఈసారి సీట్లు ఇవ్వలేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఆలపాటి రాజా,పీలా గోవింద్,బూరుగుపల్లి శేషారావు,దేవినేని ఉమా లాంటి నేతలకు కూడా టిక్కెట్లు ఇవ్వలేకపోయానన్నారు..అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఖచ్చితంగా ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని బాబు మరోసారి స్పష్టం చేసారు. భేషజాలు పక్కన పెట్టి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రజలు గెలవాలంటే దేశంలో, రాష్ట్రంలో ఎన్డీయే గెలవాలని అన్నారు. ఈసారి ప్రతి అభ్యర్థి చాలా అప్రమత్తంగా ఉండాలని, అభ్యర్థుల ఎంపిక కోసం నాలుగైదు సార్లు సర్వేలు చేసి ఎంపిక చేసానని చంద్ర బాబు చెప్పుకొచ్చారు. ఈసారి కడపలో కూడా గెలుస్తామని నేతలకు తెలిపారు.ఇక రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి 160 అసెంబ్లీ స్థానాలు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు వచ్చే 25 రోజుల పాటు అభ్యర్థుల పనితీరుపై విశ్లేషణ చేస్తామన్నారు. పనితీరు బాగోలేని వారికి పార్టీ కార్యాలయం నుంచి మళ్లీ ఫోన్‌లు వస్తాయని సున్నితంగా హెచ్చరించారు. తాను కూడా 160 నియోజకవర్గాల్లో పర్యటిస్తానని బాబు తెలిపారు.ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని. ప్రతి ఇంటిని మూడు సార్లు టచ్ చేయాలని సూచించారు. ఇక నామినేషన్ల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు,ఎన్నికల కోడ్ పై టీడీపీ ఎలక్షన్ టీం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అభ్యర్థులకు వివరించింది.

## చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు.. ఇక టీడీపీ ఉండదు.. విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:**టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి ఇవే చివరి ఎన్నికలు అని వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల తర్వాత చంద్రబాబు రాజకీయ జీవితం ముగుస్తుందని విమర్శించారు. నారా లోకేశ్ రాజకీయాలకు పనికిరాడని ఎద్దేవా చేశారు. ఇక టీడీపీ అనేది ఉండదని అన్నారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం జొన్నవాడలోని శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాగి ఆలయంలో విజయసాయి రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయసాయి రెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై ధ్వజమెత్తారు.బీజేపీతో ఏ పార్టీ పొత్తు పెట్టుకున్నా.. ఆ పార్టీ బీజేపీలో విలీనం కావాల్సిందేనని విజయ సాయి రెడ్డి ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు కూడా అంతే అని విమర్శించారు. బీజేపీలో విలీనం చేయడం తప్ప వారికి వేరే దారి లేదని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం వల్లే ఆ పార్టీతో మంచి సంబంధాలు కొనసాగించామని తెలిపారు. అప్పుడే రాష్ట్రానికి సంబంధించిన నిధులు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.చంద్రబాబు చెబుతున్న అప్పుల లెక్కలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని విజయ సాయి రెడ్డి తెలిపారు. ఏ రాష్ట్రం కూడా పరిమితి మించి అప్పులు చేయదని వివరించారు. రాష్ట్రాన్ని అప్పుల్లో నింపారని చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ప్రజలు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో దుష్ప్రచారం మొదలుపెట్టారని దుయ్యబట్టారు. ప్రజల గుండెల్లో వైసీపీ ఉందని.. ఐదేండ్లలో జగన్ వారి మనసుల్లో నిలిచిపోయారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీనే గెలుస్తుందని స్పష్టం చేశారు.



## 42వ వార్డు ఇంఛార్జి వెంకట్‌ను కలిసిన ఎన్ఎండి ఫిరోజ్




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** నంద్యాల పట్టణంలోని 42 వార్డు ఇంఛార్జి పిల్లి.వెంకట్ ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా నంద్యాల టిడిపి జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కలవడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ 42 వార్డులో చంద్రబాబు నాయుడు మేనిఫెస్టోలో విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలను తెలియజేయాలని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించే పథకాలు అవి ఎలా వస్తాయి ఎవరికి ఎవరికి వస్తాయని తెలియజేయాలన్నారు. ప్రజల్ని చైతన్య పరచాలని వార్డులో టిడిపికి మెజారిటీ తీసుకునే వచ్చే విధంగా చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుజ్జి , హుస్సేని , దస్తగిరి , రవి హరి , సాయిరాం , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరులను స్మరించుకుందాం



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి చిన్న వయసు లోనే ఉరికొయ్యలను ముద్దాడిన మహనీయులైన భగత్ సింగ్ సుకుదేవ్ రాజ్ గురు 93వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. నంద్యాల పట్టణంలోని సిపిఐ (యం యల్ )పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆ పార్టీ నాయకుడు గాలి రవిరాజ్ మాట్లాడుతు దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగనిపోరాటం చేసి నునూగూ మీసాల వయసు లోనే ఊరికొయ్యలను ముద్దాడి భారతమాతకు దాస్య విముక్తి కలిగించే పోరాటం లో తెల్లవాడి గుండెలను చీల్చి చెండాడిన వీర యోధులని అలాంటి వారిని ఇప్పుడున్న యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ బాబు శివ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## పి. గన్నవరం సీటు జనసేనకే.. అభ్యర్థిగా మాజీ పోలీస్ అధికారి

**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:** ఏపీలో టికెట్ల లొల్లి కొనసాగుతుంది. కూటమి పొత్తుల్లో భాగంగా ప్రకటించిన అభ్యర్థులపై పలు చోట్ల అభ్యంతరాలు వస్తుండడంతో అభ్యర్థులను మార్చి మరొకరికి అవకాశాలు కల్పిస్తున్నారు. తాజాగా పి.గన్నవరం సీటును టీడీపీ జనసేనకు కేటాయించింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వెంటనే అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ పేరును ప్రకటించారు. ఈయన హైదరాబాద్‌లో పోలీసు అధికారిగా పనిచేశారు. జనసేనలో చేరిన రెండు నెలల్లోనే ఆయనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారు.గతంలో ఈ సీటును టీడీపీ దక్కించుకోగా మొదటిలిస్టులోనే అభ్యర్థిగా సరిపెల్ల రాజేశ్ పేరును చంద్రబాబు ప్రకటించారు. ఆయన అభ్యర్థిత్వంపై టీడీపీ శ్రేణుల నుంచి అసంతృప్తి వ్యక్తం అవుతుండడంతో ఆ సీటును జనసేనకు కేటాయించారు. ప్రస్తుతం పొత్తులో భాగంగా జనసేనకు 21 సీట్లు కేటాయించగా పి.గన్నవరం సీటు కేటాయింపుతో ఆ సంఖ్య 22కు చేరుకుంది .




# నేడు ప్రపంచ క్షయ దినోత్సవం

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** ప్రతి సంవత్సరం మార్చి 24న టిబి బాక్టీరియా ను కనుగొన్న రాబర్ట్ కాక్ శాస్త్రవేత్త జయంతి సందర్భంగా ప్రపంచ క్షయ దినోత్సవం జరుపుకుంటాం.ఇందులో భాగంగా నంద్యాల జిల్లా లో ఉన్న 9టి బి యూనిట్స్ పరిధిలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పాంప్లెట్స్ బ్యానర్స్ వంటి ఐ ఈ సి మెటీరియల్స్ ఉపయోగించి స్కూల్స్, కళాశాల, ఏడబ్ల్యుసిలలో విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేస్తున్నాము. క్విజ్ పోటీ లు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది.క్షయ..చాపకింద నీరులా విస్త రిస్తోంది. తుమ్మినా.. దగ్గినా .. నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహిం చినా ప్రాణం మీదుకు తెస్తుంది. ఈ క్రమంలో టీబీ కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టీబీ యూనిట్ ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ లో ఒక సీనియర్ టీబీ సూపర్వైజర్, ఒక సీనియర్ ల్యాబ్ సూపర్వైజర్ విధులు నిర్వహిస్తున్నారు. క్షయ వ్యాధికేసులను గుర్తించే దుకు ప్రతి సీహెచ్సీలోనూ ఎక్రే యూనిట్లను ఏర్పాటు చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులకు అందించేందుకు మందులను సిద్ధంగా ఉంచుతున్నారు. దీంతో పాటు పట్టణ ప్రాంతాల్లో 3 టీబీ హెల్త్ విజిటర్లు పనిచేస్తున్నారు. క్షయ వ్యాధిని నిర్ధారించేందుకు గాను సర్వజన ఆసుపత్రిలో సీబీ నాట్ మిషన్ ను, జిల్లా వ్యాప్తంగా వున్న ఏరియా ఆసుపత్రులు, సి హెచ్ సిలు, పి హెచ్ సి లలో 29 ట్రూనాట్ మిషన్ల ఏర్పాటు చేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రంను మైక్రోస్కోప్ సెంటర్ గా మార్చి టీబీ లక్షణాలున్న వ్యక్తి నుంచి గళ్లను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. సేకరించిన శాంపిల్ లో టీబీ క్రిము లుంటే సదరు వ్యక్తికి డాట్ ప్రొవైడర్ ద్వారా మందులు ఇస్తూ క్షయ వ్యాధిని తగ్గించేందుకు 6 నుంచి 8 నెలల పాటు చికిత్స అందిస్తున్నారు.

### - ఇవీ లక్షణాలు..

రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, దగ్గితే గళ్ల పడటం, బరువు తగ్గడం, ఆకలి తగ్గిపోవడం, ఉమ్మిలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయగా అనుమానించి వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష




చేయించు కోవాలి. ఈ మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా గళ్ల పరీక్ష, ఎక్స్ రే తీస్తున్నారు. ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో సీబీనాట్, ఆర్టీ పీసీఆర్ పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందిస్తున్నారు. వారికి డాట్ ప్రొవైడర్ల ద్వారా 6 నుంచి 8 నెలల పాటు మందులు అందజేస్తున్నారు. వ్యాధి వచ్చిన తర్వాత వైద్యులు సూచించిన విధంగా నిర్ణీత సమయం మందులు వాడకపోతే అది మల్టీ డ్రగ్ రెసి స్టెంట్ టీబీగా మారుతుంది. దీనికి రెండేళ్ల పాటు మందులు వాడాల్సి ఉంటుంది. రూ. 2లక్షల నుంచి రూ.18 లక్షల విలువ జేసే ఈ మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. మందులతో పాటు రోగి పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.500 చొప్పున అందజేస్తున్నారు. దీంతో పాటు క్షయ వ్యాధి గ్రస్తునికి మందులు మింగించిన పర్యవేక్షకులకు (డాట్ ప్రొవైడర్)లకు రూ.1000 నుంచి రూ.5000 పారితోషికం ఇస్తున్నారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించిన వైద్యులకు కేసుకు రూ.500ల చొప్పున అందజేస్తున్నారు. 2033 సంవత్సరం క్షయ ఉన్న 3448మంది బ్యాంకు ఖాతాలు సేకరించి వారికి ప్రతి నెలా రూ.500 చొప్పున ఇప్పటి వరకు రూ.7979000 లను జమ చేశారు.

### ఆధునిక పరికారాలతో పరీక్షలు

క్షయ వ్యాధిని కచ్చితంగా నిర్ధారణ చేసే సీబీ నాటి మిషన్ల నంద్యాల సర్వజన ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, కోయిలకుంట్ల,నందికొట్కూరు, నంద్యాల రూరల్, వెలుగోడు లలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్రూనాట్ మిషన్ల ఏర్పాటు చేశారు. ఈ మిషన్ హెచ్ఐవీ రోగుల్లో, ఊపిరితిత్తుల వ్యాధులున్న వారిలో, చిన్నపిల్లల్లో క్షయ, ఎండీఆర్ టీబీని గుర్తించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. నిక్షయ్ మిత్రగా నమోదుచేసుకున్న కో ఆపరేటివ్, కార్పొరేట్, ప్రజా ప్రతినిదులు, వ్యక్తిగతంగా, పలు రకాల సంస్థలు,ఎన్జీవోలు, రాజకీయపార్టీల ద్వారా క్షయ రోగులకు అవసరమైన పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 256 సంస్థలు రిజిస్టర్ చేసుకుని రోగులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు.

### టీబీ పరీక్షల వివరాలు

| సంవత్సరం | పరీక్షలు | బాదితులు |
|---|---|---|
| 2015 | 8073 | 2901 |
| 2016 | 15900 | 2822 |
| 2017 | 16024 | 2855 |
| 2018 | 7244 | 3770 |
| 2019 | 17909 | 4110 |
| 2020 | 23062 | 2791 |
| 2021 | 29346 | 3467 |
| 2022 | 18049 | 3398 |
| 2023 | 30154 | 3478 |
| 2024(ఇప్పటివరకు ) | 2624 | 516 |

క్షయ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి.టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అదే సమయంలో నివారణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయ వ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాము, ఈ మేరకు డాట్ ప్రొవైడర్ ద్వారా ఈ మందులను వ్యాధిగ్రస్తులు తీసుకుని వాడాలి. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా వీటిని వాడుతూ ఉండాలి. మందులు వేసుకోవడం ఆపితే మళ్లీ మొదటి నుంచి మందులు ఎక్కువ డోసుతో వేసుకోవాల్సిన ప్రమాదం ఉంటుంది. క్షయ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ శారదబాయి, నంద్యాల జిల్లా క్షయ నియంత్రణాధికారి, తెలిపారు.

# జర్నలిస్టుల కోర్కెలను నెరవేర్చాలి: ఏపీయుడబ్ల్యూజె నాయకులు




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** భగత్ సింగ్ అమరత్వాన్ని స్మరిస్తూ మార్చ్ 23న జర్నలిస్టుల కోర్కెలదినం సందర్భంగా



నంద్యాల ఎపియుడబ్లుజె ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎపియుడబ్లుజె జిల్లా అధ్యక్షుడు మధుబాబు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలం బాబు ఏపీడబ్ల్యు జిల్లా కార్యదర్శి హుస్మాన్ భాష,గౌరవాధ్యక్షులు కనకరాజులు మాట్లాడుతూ సర్దార్ భగత్ సింగ్ అమరత్వాన్ని స్మరిస్తూ మార్చ్ 23 వ తేదీన దేశవ్యాప్తంగా జరప తలపెట్టిన జర్నలిస్టుల కోర్కెలదినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ పిలుపు మేరకు



ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. దేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ , డిజిటల్ మీడియా అపారంగా విస్తరించడంతో మీడియా స్వరూప స్వభావాలలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడానికి "మీడియా కమిషన్" ఏర్పాటు చేయాలని, మీడియా సిబ్బందిపై, మీడియా సంస్థలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో మీడియా భద్రత కోసం వెంటనే ఒక ప్రత్యేకచట్టం చేయాలని, 2007 లో ఏర్పాటైన మజీథియా వేతన సంఘం తర్వాత గత పదిహేనేళ్ళుగా వర్కింగ్ జర్నలిస్టుల వేతనాలలో సవరణ జరగనందున వెంటనే కొత్త వేజ్ బోర్డును నియమించాలని కోరడం జరిగిందన్నారు.

# మేమంతా సిద్ధం సభను విజయ వంతం చేయండి

**- వైఎస్సార్ సీపీ కర్నూలు నంద్యాల కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**

**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** ఈనెల 28వ తేదీన నంద్యాలలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్ఆర్సిపి పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నంద్యాల పట్టణంలోని ఉదయానంద రెసిడెన్సి కాన్ఫరెన్స్ హాల్లో నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఎమ్మెల్సీ రామ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నంద్యాల అధ్యక్షుడు ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, గంగుల బిజేంద్ర నాథ్ రెడ్డి, పరిశీలకులు మల్కి రెడ్డి రాజగోపాల్ రెడ్డి, రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి కర్నూలు నంద్యాల జిల్లాల కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ... ఈనెల 27వ తేదీన వైఎస్ఆర్సిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర సభను ఈనెల 27వ తేదిన ఇడుపులపాయలో ప్రారంభించి ఈనెల 28వ తేదీ నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం గా అధికారం చేపట్టిన 5 సంవత్సరాలలో చేసిన పరిపాలన, నాడు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను, మేనిఫెస్టోను అమలు చేసిన విధానాన్ని , ప్రజలకు జరిగిన మేలుల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. 2019 ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోను భగవద్గీతగా, ఖురాన్ గా, బైబిల్ గా జగన్మోహన్ రెడ్డి పరిగణించి ఇచ్చిన ప్రతి హామీలను 95 శాతం అమలుపరిచారన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీకి, ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డికి మరో అవకాశం కల్పించాలని కోరడం జరుగుతుందని తెలిపారు. నంద్యాల జిల్లాలో చేపట్టనున్న "మేమంతా సిద్ధం" భారీ బహిరంగ సభకు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న "మేమంతా సిద్ధం" బస్సు యాత్ర సభలను అన్ని జిల్లాల కేంద్రాల వారిగా ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈనెల 28వ తేదీ నంద్యాలలో సాయంత్రం 4 గంటలకు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 27న ఇడుపులపాయ నుండి "మేమంతా సిద్ధం సభ బస్సు యాత్ర ప్రారంభమై కొనసాగుతూ అదే రోజున సాయంత్రం 5 గంటలకు ప్రొద్దుటూరుకు చేరుతుందని అక్కడ సభ పూర్తి చేసుకొని ఆళ్ళగడ్డలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాత్రి బస చేస్తారన్నారు. మరుసటి రోజు 28వ తేదీ నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో "మేమంతా సిద్ధం" సభ భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నాడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో



ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, హామీలను, నవరత్నాలను అన్నింటిని అమలుపరిచారని తెలిపారు. ఈ సభలో వైఎస్ఆర్ పార్టీ ఇచ్చిన హామీల అమలు, ప్రతిపక్ష టిడిపి పార్టీ ఇచ్చిన మేనిఫెస్టో అమలు మధ్య తేడాలను ప్రజలకు వివరంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. రాయలసీమలోని రాప్తాడులో సిద్ధం సభ అత్యంత భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందని, ఆసభ ఎంతో దిగ్విజయంగా 10 లక్షల మంది పైగా పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇదే రీతిలో నంద్యాలలో నిర్వహించనున్న "మేమంతా సిద్ధం" సభ దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల సభ తర్వాత 29వ తేదీ ఎమ్మిగనూరు లో "మేమంతా సిద్ధం" సభ నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. సమావేశం అనంతరం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నందు నిర్వహించనున్న సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ చైర్మన్ కల్లూరి రామలింగారెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పామ్ షావలి, అడ్వకేట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# భజన భగవన్నామము నాలుక మీద నర్తింప చేస్తుంది

**- డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తి.తి.దే - గిద్దలూరులో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు**

**ఆంధ్ర ప్రగతి/గిద్దలూరు మార్చి 23:** భజన భగవన్నామము నాలుక మీద నర్తింప చేస్తుందని, భగవంతుని మీద దృష్టిని కేంద్రీకరించి, శాశ్వతమైన ఆనందానుభూతిని కలిగిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. సంజామల మండలం, గిద్దలూరు గ్రామంలోని శివాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగిం



పు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భజన యొక్క విశిష్టతను గురించి వివరించారు. కర్నూలుకు చెందిన స్వాత్మానంద స్వామిచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే రోజూ భజనలు, ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తెలుగు శేషమ్మ, ఉప సర్పంచ్ బత్తుల సులోచనమ్మ, అర్చకులు జంగం మహేశ్వరయ్య, కె.రామిరెడ్డి, టి.అన్నయ్య, జి. సుబ్బయ్య, జి.చెన్నారెడ్డి, కె.శివరామప్రసాద్, హార్మోనిష్టు సుబ్బారాయుడు, డోలక్ తెలుగు చంద్ర, భజన మండలి సభ్యులు కె.రవికాంత్ రెడ్డి, జి.శివచెన్నారెడ్డి, కె.చంద్రశేఖరరెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, ధనలక్ష్మి , కె.మాధవి, కె.లలిత,బి.పద్మావతి, కె.సుజాత, జి.రామలక్ష్మమ్మ, వెంకటేశ్వర రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---

## అమరవీరులను స్మరించుకుందాం.!

**- ఏపిడిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్**




**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి చిన్న వయసు లోనే ఉరికొయ్యలను ముద్దాడిన మహనీయులు, నేటి మన స్వేచ్ఛ భారతం కోసం చిరుప్రాయంలోనే తమ ప్రాణాలను తృణపాయంగా త్యాగం చేసిన భరతమాత ముద్దుబిడ్డలు, విప్లవ చైతన్యమూర్తులు సర్దార్ భగత్ సింగ్, సుకుదేవ్,రాజ్ గురు లను ఆదర్శంగా తీసుకోవాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలిఅన్నారు.93వ వర్ధంతి సందర్భంగా స్థానిక నంద్యాల పట్టణంలోని జగజ్జనని నగర్ లో ఉన్న డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షులు డిపి మస్తాన్ వలి మాట్లాడుతు దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగనిపోరాటం చేసి నునూగూ మీసాల వయసు లోనే ఊరికొయ్యలను ముద్దాడి భారతమాతకు విముక్తి కలిగించే పోరాటం లో తెల్లవాడి గుండెలను చీల్చి చెందాడిన వీర యోధులని అలాంటి వారిని ఇప్పుడున్న యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం డిజేబుల్డ్ రైట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, సలహాదారులు నబి రసూల్, సభ్యులు ఖాదర్ బాషా, చాంద్ బాషా ,ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

## రామ్ చరణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా అన్నదానం



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత రవణం స్వామి రామ్ నాయుడు ఆదేశాల మేరకు నంద్యాల నియోజకవర్గంలో మొదటి రోజుగా యాచకులకు అల్పాహార వితరణ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ ఫాన్స్ జిల్లా అధ్యక్షులు పబ్బతి రవికుమార్ మాట్లాడుతూ.. రేపటి రోజున మహానంది దేవస్థానంలో పూజా కార్యక్రమాలు మరియు వికలాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ మరియు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం మరియు రక్తదాన శిబిరము ఈ కార్యక్రమాలన్నీ ఈ సంవత్సరంలో ఈ వారం రోజుల్లో జరుగుతాయని తెలియజేశారు. జనసేన నాయకులు సాయి జయంత్ , సందీప్ , సురేష్ చౌదరి, సింహాసనం నగేష్, మెగా అభిమానులు గబ్బర్ సింగ్ ,కళ్యాణ్ ,సుమన్, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆ నటి వేధిస్తోంది.. వైజాగ్ పోలీసులకు రిటైర్డ్ ఉద్యోగి ఫిర్యాదు



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:**స్నేహితురాలి ఇంట్లో కిలో బంగారం కొట్టేసి దొరికిపోయిన సినీ నటి సౌమ్యశెట్టిపై తాజాగా మరో కేసు నమోదైంది. చోరీ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన సౌమ్య శెట్టి తమను వేధిస్తున్నదని రిటైర్డ్ పోస్టల్ శాఖ మాజీ ఉద్యోగి జనపాల ప్రసాద్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోషల్‌మీడియాలో రకరకాల పోస్టులు పెట్టడంతో పాటు, వివిధ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇస్తూ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సౌమ్య తీరుతో తన కుటుంబం, తన కుమార్తె కుటుంబం మానసిక క్షోభను అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో సౌమ్య శెట్టితో పాటు ఆమె తల్లి, భర్త బలరాంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అయితే తాను చోరీ చేయలేదని.. మౌనిక కుటుంబసభ్యులే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సౌమ్య సోషల్‌మీడియా వేదికగా ఆవేదన వ్యక్తం చేసింది. తాను మౌనిక ఇంటికి వెళ్లి.. కంగారుగా బయటకు వచ్చినట్లు చెబుతున్న వాళ్లు.. సీసీ టీవీ ఫుటేజీని ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించింది. నాలుగుసార్లు వాళ్ల ఇంటికి వెళ్తే ప్రతిసారి తనకు సెండాఫ్ ఇచ్చేందుకు కిందకు రాలేదా? అని నిలదీసింది. తన డాడీ వెనకాల దాక్కొని మౌనిక డ్రామాలు చేస్తుందని మండిపడింది. తనపై వేసిన నిందలపై న్యాయపోరాటం చేస్తానని.. తన నిజాయితీని నిరూపించుకుంటానని స్పష్టం చేసింది.అసలేం జరిగిందంటే..వైజాగ్‌కు చెందిన సౌమ్య శెట్టికి యాక్టింగ్, సినిమాలు అంటే పిచ్చి. ఆ ఆసక్తితోనే పలు షార్ట్ ఫిలింస్‌లో నటించింది. చిన్న చిన్న సినిమాల్లోనూ ఆమెకు ఛాన్స్‌లు వచ్చాయి. యువర్స్ లవింగ్లీ, ది ట్రిప్ సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. ఆ తర్వాత అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకుంటూ సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇలా ఆడిషన్స్ ఇస్తున్న సమయంలోనే వైజాగ్‌లోని దొండపర్తి బాలాజీ మెట్రో అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్ నెంబర్ 102లో పోస్టల్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి జనపాల ప్రసాద్ బాబు తన కూతురు మౌనికతో ఆమెకు పరిచయం ఏర్పడింది. 2016లో ఏర్పడిన ఈ పరిచయం కాస్త తరచూ వాళ్ల ఇంటికి వెళ్లే వరకూ వచ్చింది. ఆ చనువుతో ఇంట్లో పరిసరాలన్నీ స్కాన్ చేసిన సౌమ్యకు.. మౌనిక ఇంట్లో ఉన్న కిలో బంగారం కంటపడింది. దీంతో ఎలాగైనా ఆ బంగారం కొట్టేయాలని అనుకున్న సౌమ్య.. మౌనిక ఇంటికి వెళ్లినప్పుడల్లా నేరుగా బెడ్‌రూంలోకి వెళ్లి.. బాత్‌రూం వాడుకుంటానని చెప్పి గంటలు గంటలు గడిపేది. ఇలా రెండు మూడు సార్లు చేసిన సౌమ్య.. ప్రతిసారి తన చేతివాటం ప్రదర్శించింది. విడతల వారీగా కిలో బంగారం కొట్టేసింది. కూల్‌గా గోవాకు చెక్కేసింది.మౌనిక కుటుంబ సభ్యులు ఫిబ్రవరి 23 యలమంచిలోని బంధువుల వివాహానికి వెళ్లేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో బంగారు నగల కోసం బీరువా లాకర్ తెరవగా అందులో ఆభరణాలు కనిపించలేదు. దీంతో కంగారుపడిపోయిన మౌనిక తండ్రి ప్రసాద్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు.. క్లూస్ టీమ్ సహాయంతో బీరువాపై ఉన్న ఫింగర్ ప్రింట్స్‌ను సేకరించింది. అలాగే ప్రసాద్‌బాబు, మౌనికను విచారించగా ఇటీవల వాళ్లింటికి వచ్చిన పలువురిపై అనుమానం ఉందని తెలిపారు. దీంతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి 11 మంది అనుమానితులపై దర్యాప్తు చేపట్టారు. వీరిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలోనే హీరోయిన్ బండారం బయటపడింది. సౌమ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమె నుంచి 74 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని మౌనిక కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ కేసులో సౌమ్య ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యింది.

## బాల అకాడమీ పాఠశాలలో ముందస్తు హెూలీ సంబరాలు



**ఆంధ్రప్రదేశ్/నంద్యాల మార్చి 23:** నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాల అకాడమీ పాఠశాలలో 23/3/ 2024వ తేదీన అనగా శనివారం రోజున ఘనంగా హెూలీ సంబరాలను జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, శ్రీమతి మాధవవీలత మాట్లాడుతూ హెూలీ వస్తుందంటే చాలు దేశమంతా పండుగ దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో హెూలీ ఒకటి ఈ పండుగను సత్యయుగం నుండి జరుపుకుంటున్నట్లు హిందూ పురాణాలు తెలుపుతున్నాయి హెూలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనది అని అర్థం. హెూలీని "హెూలీకా పూర్ణిమ" గా కూడా వ్యవహరిస్తారు రాక్షస రాజు హిరణ్యకశిపుడి కుమారుడు ప్రహ్లాదుడు నిత్యం విష్ణుమూర్తిని స్మరిస్తుంటాడు. దీనితో అతని సోదరి హెూలీకను పిలుస్తాడు. ఆమె ప్రహ్లాదుడిని మంటల్లోకి పడవేస్తే ఆ మంటల్లో ప్రహ్లాదుడు విష్ణు మాయతో ప్రాణాలతో బయటపడి ,హెూలిక రాక్షసి మాత్రం ఆ మంటల్లో పడి చనిపోతుంది. హెూలీక దహనమైన రోజుని హెూలీగా జరుపుకుంటాము అని పండుగ యొక్క విశిష్టతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు పసుపు,కుంకుమ,గంధం లను పూసుకొని రంగు నీరు చల్లుకొని ఆనందోత్సాహంలో తేలియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్ సార్ గారు ప్రిన్సిపల్ శ్రీమతి మాధవీలత మేడం గారు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం

**- ఆర్ఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్**



**ఆంధ్రప్రదేశ్/నంద్యాల మార్చి 23:** రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నాడు నంద్యాలలో భగత్ సింగ్ 93 వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుమల్ల శ్రీధర్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధనలో విద్యార్థులు యువకులు ముందుకు సాగాలని. దేశంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను అరాచకాలను రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. భగత్ సింగ్ 23 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర కోసం అనేక పోరాటాలు చేసినటువంటి ఘనత భగత్ సింగ్ దక్కిందన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ ఢిల్లీ నడి వీధుల్లో ఎర్ర కాగితాలు పంచుతూ ప్రజల్లో స్వాతంత్రం పై చైతన్యం నింపాడు. దేశ ప్రజల విముక్తి కొరకై బ్రిటిష్ తెల్ల దొరలు వారిని ఎదిరించి వాళ్లకు వ్యతిరేకంగా పార్లమెంటులో నినాదాలు చేస్తూ భారతదేశ విప్ల కోసం పోరాడి వీర మరణం పొందారు.విద్యార్థులుగా యువకులుగా మనం కూడా నాణ్యమైన చదువు కోసం. ఉపాధి కోసం. నిరుద్యోగి యువతీ యువకులు చేయి చేయి కలిపి రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసి మన హక్కుల కోసం పోరాడాలన్నారు. భగత్ సింగ్ ఆశయాలు కోసం రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ అలుపెరగని పోరాటాలు చేస్తుందని ఆయన స్ఫూర్తితో రాబోయే రోజుల్లో విద్యార్థులు పక్షాన పోరాడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శిల్పా రవి



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల, మార్చి 23:** పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని పట్టణంలోని అల్ఫూర్ ఖాన్ ఈద్గా , మజీద్ ఖాన్ మసీద్ లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో ఎంఎల్ఏ శిల్పా రవి రెడ్డి, ఎమెల్సీ ఇసాక్ బాష పాల్గొన్నారు.నంద్యాల పట్టణంలోని భీమవరం రోడ్డునందు ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని అల్ఫూర్ ఖాన్ ఈద్గా , మజీద్ ఖాన్ మసీద్ లో శుక్రవారం ముస్లిం సోదరులతో, పెద్దలతో కలిసి ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అల్లా అందరికి మంచి చేయాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసీద్ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ వార్డు ఇంచార్జ్ కిరణ్ ,ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## అమరవీరులను స్మరించుకుందాం




**ఆంధ్ర ప్రగతి/పాణ్యం మార్చి 23:** దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి చిన్న వయసు లోనే ఉరికొయ్యలను ముద్దాడిన మహనీయులైన భగత్ సింగ్ సుకుదేవ్ రాజ్ గురు 93వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు పాణ్యం సిఐటియు కార్యాలయంలో సిఐటియు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు. బత్తిని ప్రతాప్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అలుపెరుగనిపోరాటం చేసి నునూగూ మీసాల వయసు లోనే ఊరికొయ్యలను ముద్దాడి భారతమా తకు దాస్య విముక్తి కలిగించే పోరాటం లో తెల్లవాడి గుండెలను చీల్చి చెందాడిన వీర యోధులని అలాంటి వారిని ఇప్పుడున్న యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పార్థసారథి రెడ్డి బాబు బాషా నాగరాజు హమాలీ వర్కర్స్ ఆటో వర్కర్స్‌లు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిని నిర్మూలించండి

**- డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ముస్తాక్ పాషా, డాక్టర్ అప్సర్ ఫాతిమా**



**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** ప్రపంచ క్షయ వ్యాధినివారణ దినోత్సవం సందర్భం గా శనివారం నాడు శాంతిరామ్ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ముస్తాక్ పాషా మరియు ప్రొఫెసర్ డాక్టర్ అప్సర్ ఫాతిమా గార్ల ఆధ్వర్యాన నందివర్గం గ్రామం లో క్షయ వ్యాధినివారణ అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భం గా ప్రొఫెసర్ లు డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ముస్తాక్ పాషా మరియు ప్రొఫెసర్ డాక్టర్ అప్సర్ ఫాతిమా , అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీహరి మరియు ఇతర సిబ్బంది వ్యాధిలక్షణాలు,క్షయ వ్యాధినివారణ గురించి అవగాహన వైద్య విద్యార్థులు మరియు గ్రామ ప్రజల కు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో శాంతిరామ్ వైద్య కళాశాల విద్యార్థులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో ఎన్ఎండి ఫిరోజ్





**ఆంధ్ర ప్రగతి/నంద్యాల మార్చి 23:** నంద్యాల పట్టణంలోని 8వ వార్డు ఉప్పరిపేట నందు గల మసీద్ - ఏ - అంటి కోట , మసీద్ - ఏ - దాయి హలీమ , మసీద్ - ఏ - అజీజియా మసీదులలో ఈరోజు ఇఫ్తార్ విందులో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ప్రతి మసీదుకు ఇఫ్తార్ విందును అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు . పవిత్రమైన ఈ రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో ఒక పొద్దు ఉంటారన్నారు వారికి ఆ అల్లా ఎప్పుడు తోడుంటారన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్ , 8 వార్డు టిడిపి ఇంచార్జ్ ఉప్పరి సురేష్ కుమార్ , ఉప్పరి సుబ్రహ్మణ్యం , హుసేని , జియా , బాలహజి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ గవర్నర్‌కు తీవ్ర అస్వస్థత .. ఆస్పత్రిలో చేరిక



**ఆంధ్ర ప్రగతి/అమరావతి మార్చి 23:**ఏపీ గవర్నర్ అబ్దుల్ నాజిర్ తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయన్ను విజయవాడలోని మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు గవర్నర్‌కు చికిత్స అందిస్తున్నారు. గవర్నర్ అబ్దుల్ నాజిర్‌కు వైద్య పరీక్షలు చేసి.. ఎండోస్కోపీ నిర్వహించాలని వైద్యులు సూచించినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఉన్నట్టుండి గవర్నర్ అనారోగ్యానికి గురి కావడానికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. దీనిపై ఏపీ రాజ్‌భవన్ కూడా ఎలాంటి ప్రకటన చేయలేదు.నాజిర్ గత ఏడాదికాలంగా ఏపీకి గవర్నర్‌గా సేవలందిస్తున్నారు. అంతకుముందు 2017 -2023 వరకు సుప్రీం కోర్టులో జడ్జిగా పనిచేశారు.